క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తొండూరు : స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ తులశమ్మ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అర్హులైన బాలికలు ఈనెల24వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని.. మరిన్ని వివరాలకు 9494077178, 8074328866 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

4న పట్టుబడ్డ వాహనాల వేలం

ముద్దనూరు : స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 4వ తేదీన వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఎస్ఈబీ సీఐ చెన్నారెడ్డి గురువారం తెలిపారు. 4వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక స్టేషన్‌లో బహిరంగ వేలం వేయబడునని ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : మండలంలోని కడప రోడ్డు చందమామ డాబా నుంచి మెడికల్ కళాశాల వరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కె.వి. విద్యుత్ ఇండస్ట్రియల్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందని.. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

భానుకోట క్షేత్ర హుండీ ఆదాయం లెక్కింపు



భానుకోట క్షేత్రంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

సింహాద్రిపురం : మండల పరిధిలోని రావులకొలను పంచాయతీ పరిధిలో వెలసిన భానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రంలో ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు గురువారం ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమణల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని భానుకోట క్షేత్రంలో హుండీ ద్వారా రూ.2,22,110లు రాగా.. 12 వెండి గొడుగులు, ఒక బంగారు గొలుసు వచ్చిందని వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఆలయ అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేయిస్తున్న పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు

జమ్మలమడుగు : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల పరిధి పి.బొమ్మేపల్లి గ్రామంలోని పశువులకు ఆయన టీకాలు వేయించి అనంతరం మాట్లాడారు. టీకాలు వేయడం వల్ల గాలికుంటు వ్యాధి రాకుండా అరికట్టవచ్చునన్నారు. గ్రామాల్లో ఈనెలవరకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.సుధాకర్‌బాబు, సహాయకులు మోహన్ నాయక్, రాము సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి అకస్మీకంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాలకు సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పది ఫలితాల్లో విద్యార్థులు కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుజాత, హెచ్ఎం శ్రీనువాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆవులపబ్బం జాతర



గంగమ్మతల్లి

ఎర్రగుంట్ల : మండల పరిధి కలమల్ల గ్రామ సమీపంలో ముద్దనూరు రోడ్డు ఆరో యూనిట్ పక్కన వెలసిన గంగమ్మతల్లి దేవస్థానంలో 4, 5 తేదీలలో ఆవులపబ్బం (గంగజాతర) మహోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్త గోర్ల కాంతమ్మ తెలిపారు. శనివారం ఉదయం పుట్టబంగారం తెచ్చుట, పొంగుపాల యాగం, మధ్యాహ్నం సిద్ధయక్తి యాగం, సాయంత్రం శమీవృక్ష యాగం, రాత్రి గంగా కాటమరాజు కథ, ఆదివారం ఉదయం పాలేటి యాగం, మద్దిమాను యాగం ఉంటుందన్నారు. శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

పూత, పిందె లేని చీనీచెట్లు..

ఆందోళనలో రైతులు



నల్ల మంగుతో ఉన్న చీనీ కాయలు



పూతలేని చీనీ చెట్టు

సింహాద్రిపురం : వాతావరణం అనుకూలించక చీనీ చెట్లకు పూత లేక, పిందె రాకపోవడంతో చీనీ రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోనే సింహాద్రిపురం మండలంలో 16,500 ఎకరాలలో చీనీ పంటను సాగు చేయగా.. అందులో 6 వేల నుంచి 7 వేల ఎకరాలలో దిగుబడి ఇచ్చే చీనీచెట్లు ఉన్నాయి. నవంబర్ మొదటి వారం నుంచి జనవరి చివరి వరకు వచ్చే సీజన్ కాపు ఈ ఏడాది వాతావరణ ప్రభావంతో పలుమార్లు మొగిలి రావడంతో చీనీ చెట్లకు వచ్చిన పూత మగ్గిపోయి పిందె పడకపోవడంతో కాయలు లేవు. దీంతో చీనీ రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు. దాదాపు ఎకరాకు రూ.50వేల వరకు పెట్టుబడులు పెట్టి నష్టపోయామని.. అంతేకాక చీనీ చెట్లకు బంకు తెగులు, పులుసు పురుగు తెగుళ్లతో ఒక పక్క చీనీచెట్లు చనిపోవడం జరుగుతోందని... మరోపక్క వాతావరణం అనుకూలించక చీనీ రైతులకు ఈ ఏడాది నష్టాలు మిగిల్చాయని వాపోతున్నారు. అరకొర చీనీ కాయలు ఉన్న నల్ల మచ్చలు ఉండటంతో చీనీ కాయలు ధర ఉన్నా కూడా సగం ధరకే వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని.. ప్రస్తుతం ధర రూ.35వేల నుంచి రూ.40వేల వరకు ఉన్నా పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉండటంతో రైతులు నష్టపోతున్నారు. టన్ను చీనీ కాయలకు 250కిలోల నుంచి 300కిలోల చీనీ కాయలు అడుగుతున్నారని చీనీ రైతులు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నష్టపోయామని చీనీ రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలలో అలసత్వం వహించొద్దు

పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

వేముల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలలో అలసత్వం వహించొద్దని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాలనీలలో ఇళ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు అందుబాటులో ఉండాలని.. మెటీరియల్ సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు, స్పెషలాఫీసర్ అర్జునరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, హౌసింగ్ డీఈ బాలగంగన్న, హౌసింగ్ ఏఈ సుకుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వేంపల్లె : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో హౌసింగ్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఇసుక, సిమెంటు పూర్తిగా ఉచితంగా అందిస్తోందన్నారు. అలాగే విద్యుత్, నీటికి సమస్యలు లేకుండా అందిస్తున్నామన్నారు. ఇళ్లు కట్టుకోలేని స్థితిలో ఉన్నవారికి స్థలాన్ని రద్దు చేయా లన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు, హౌసింగ్ ఏఈ బాలగంగన్న, మండల స్పెషలాఫీసర్ రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రమారెడ్డి, జేఈ చంద్రశేఖరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

లింగాల : జూన్ నెలాఖరుకల్లా మండలంలో మంజూరైన ప్రభుత్వ పక్కాగృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పక్కాగృహాల నిర్మాణంపై ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం లింగాల మండల కేంద్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల నూతన భవనాలు నిర్మించేందుకు ఆయన స్థల పరిశీలన చేశారు. ఆయా కార్యాలయాల నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్డీఓ వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

కోటా దుర్గాభవానికి మొల్లమాంబ పురస్కారం



దుర్గాభవాని

కడప కల్చరల్ : ప్రొద్దుటూరుకు చెందిన కవయిత్రి కోటా దుర్గాభవానీకి మహాకవయిత్రి మొల్లమాంబ సాహిత్య పురస్కారం ఇవ్వనున్నట్లు మొల్ల సాహిత్య పీఠం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులో జరగనున్న సభలో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి, పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం తదితరులు హాజరవుతారన్నారు. మొల్లమ్మ పురస్కారంగా ఆమెకు నగదుతోపాటు జ్ఞాపిక అందించి సత్కరించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు విద్యా సామగ్రితో పాటు మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ కొండారెడ్డి, మానవత సంస్థ ప్రతినిధులు, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధి కోగటం రోడ్డులోని సుందరయ్యనగర్ కాలనీ సమీపంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన తొమ్మిదవ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరగనుండటంతో ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అదే రోజు శ్రీనివాసుడి కల్యాణం, గ్రామోత్సవం ఉంటుందన్నారు.

ఘనంగా ఐఈఆర్టీకి సన్మానం

వేంపల్లె : స్థానిక వేంపల్లె భవిత కేంద్రంలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఐఈఆర్టీ ఎస్.రామాంజులరెడ్డిని ఎంఈఓ వీరారెడ్డి, పాఠశాల హెచ్ఎం ఖాజా పర్వీన్‌లు గురువారం ఘనంగా సత్కరించారు. అనంతరం దివ్యాంగ చిన్నారులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘమిత్ర ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, ఐఈఆర్టీలు యశోధ, రాంబాబు, సంగీత లక్ష్మి, సీఆర్పీలు ప్రకాష్‌రెడ్డి, కళ్యాణి, సూర్యకుమారి, ఎంఐఎస్ ఖాదర్, సిబ్బంది మాధవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

ముద్దనూరు : మానవత సేవా ఆధ్వర్యంలో ముద్దనూరులో బెంగుళూరుకు చెందిన శంకర్ నేత్రాలయం సిబ్బంది గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఆపరేషన్ అవసరం అయిన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు రవీంద్రానాథరెడ్డి, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాకూ పరిహారం ఇవ్వాలి

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె వద్ద నిర్మిస్తున్న స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులతో పాటు భూములు లేని వారికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని పెద్దదండ్లూరు, సున్నపురాళ్లపల్లె, సిరిగేపల్లె గ్రామాలకు చెందిన కొంత మంది ప్రజలు స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఎమ్మెల్యే వారితో ఆర్డీఓ కార్యాలయానికి వచ్చి ఆర్డీఓ శ్రీనివాసులుతో చర్చించారు. 2012–13 సంవత్సరంలో ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు ఇచ్చారని అయితే గ్రామాలకు చెందిన కొంత మంది నాయకులు తమ వద్ద డబ్బు తీసుకుని భూములు ఇప్పిస్తామని మోసం చేశారని, ఇప్పుడు చూస్తే రికార్డ్‌లలో తమ పేర్లులేవని వారు తెలిపారు. దీనిపై ఆర్డీఓ మాట్లాడుతూ రికార్డ్‌లలో పేర్లు లేకపోతే తాను, ఎమ్మెల్యే ఏమీ చేయలేమని ఆయన వారికి తెలిపారు. భూముల కొరకు డబ్బులు ఎవరికి ఇచ్చారో లిఖిత పూర్వకంగా తనకు వ్రాసి ఇస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసి డబ్బులు ఇప్పిస్తానని ఆయన సూచించారు.

దళితుల ఇళ్ల స్థలాన్ని వారికే కేటాయించాలి

వేముల : వేములకు సమీపంలోని చెరువుకట్ట వద్ద దళితుల ఇళ్ల కోసం కేటాయించిన స్థలాన్ని వారికే కేటాయించేలా చూడాలని గురువారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిని మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి కోరారు. వేముల చెరువుకట్ట సమీపంలో దళితులకు కేటాయించిన స్థలాన్ని ఇతరులకు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు చెట్లను తొలగిస్తుండగా లబ్ధిదారులు మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై ఆయన పాడా ఓఎస్డీతో మాట్లాడారు. గతంలోనే ఆ స్థలాన్ని దళితులకు కేటాయించారని.. ఇప్పుడు ఆ స్థలాన్ని చదువు చేసి ఇతరులకు ఇస్తున్నారని.. ఆ స్థలాన్ని దళితులకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఓఎస్డీ దళితుల స్థలాన్ని వారికే ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరం

సింహాద్రిపురం : భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమని డిప్యూటీ డెమో అధికారిణి రమణమ్మ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని నిడివెల్ల కస్తూర్బా బాలికల విద్యాలయంలో గురువారం వైద్యాధికారులు ఎల్లా కుమార్, హుస్సేన్ పీరాల ఆధ్వర్యంలో ఆమె విద్యార్థులకు బేటీ బచావో.. బేటీ పడావో, సీపీపీఎన్ఎన్‌డీటీ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమని.. లింగ నిష్పత్తిలో ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. సమాజం బాగుపడాలంటే స్త్రీ, పురుషులు సమానంగా ఉండాలని.. అలా లేని యెడల సమాజంలో సాంఘిక దురాచారాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వండి



రోడ్లపై ఉన్న మురికినీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఆయన పలు వార్డులలో పర్యటించి మాట్లాడారు. రోడ్లపై చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. రోడ్లపై నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. రాత్రిపూట ఇష్టానుసారంగా రోడ్డుపై చెత్తను వేసే అంగళ్లపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పలు హోటళ్లను పరిశీలించి శుభ్రత పాటించాలని.. ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలన్నారు. అనంతరం గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించి చెత్త ద్వారా సంపద తయారు చేసే విధానాన్ని తనిఖీ చేశారు. అలాగే ఉల్లిమెల్ల, పెద్దరంగాపురం వార్డు సచివాలయాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులను మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఐసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



పాదచారులకు జ్యూస్ అందజేస్తున్న ఎస్ఐ చిన్నపెద్దయ్య

కమలాపురం : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో అభి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన మజ్జిగ, జ్యూస్‌లను ఆయన పాదచారులకు అందజేసి మాట్లాడారు. ఆసుపత్రి, వివిధ ప్రభుత్వ కార్యాలయాలున్న చోట చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వేసవి కాలం ముగిసే వరకు జన సంచారం అధికంగా ఉన్న చోట దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి రోజు చలివేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి మంచినీటిని అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నాగేశం విజయ్‌బాబు, సభ్యులు ముదిరాజ్ రాము, లక్ష్మణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 5 మందికి కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం 5 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువ చేసే చెక్కులను ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్య శాలల్లో చికిత్స పొందడానికి అవకాశం కల్పిస్తూ వ్యాధుల సంఖ్యను గణనీయంగా పెంచారన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వర్తించని జబ్బులకు సంబంధించి చికిత్సలు పొందిన బాధితులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల వైఎస్ఆర్ సీపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరతో అదనపు భారం



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై అదనంగా రూ.50 పెంచి సామాన్య మధ్య తరగతి ప్రజలపై అదనపు భారం మోపడం దారుణం అని సీపీఎం జిల్లా కార్యదర్శి శివనారాయణ అన్నారు. గురువారం స్థానిక పాతబస్టాండ్‌లో గ్యాస్ పెంపుదలపై ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థల ఆదాయాన్ని పెంచడానికి కృషి చేస్తోందని ఆయన మండిపడ్డారు. గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కమలాపురం : మండల పరిధిలోని సి.గోపులాపురంలో వెలసిన పట్టాభి రామచంద్రస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు గణపతి పూజతో మొదలై స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తామన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పాలపళ్ల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో గెలుపొందిన విజేతలకు రూ.25వేలు, రూ.20,016, రూ.15వేలు, రూ.10,116, రూ.5,016 నగదు బహుమతులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు 63039 82843, 98669 28951 నెంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



ఎర్రగుంట్లలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్



గంగవరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : వైఎస్సార్ సీపీ బలపరచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి తెలిపారు. గురువారం వారు మండలంలోని గంగవరం, విభరాపురం తిరిగి గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులను కలసి ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవాగుణం కలిగిన అభ్యర్థులను ఎంపిక చేశారని, వారిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, నాగేంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, హరినాథరెడ్డి, మర్రి సుబ్బన్న, దాసరి సురేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కమలాపురం పట్టణంలోని పలు వార్డుల్లో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, ఇతర నాయకులు ప్రచారం నిర్వహించారు.

వేంపల్లె : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు కోరారు. గురువారం వేంపల్లె పట్టణంలోని గాంధీ రోడ్డు ఇరువైపులా, కళాశాల రోడ్డు వరకు, జీఎం కాంప్లెక్స్ వీధి, ఆర్ఎంఎస్ వీధి, బండల ఉత్తన్న వీధి, రాఘవేంద్ర స్కూలు వీధి, బొడ్డు చావిడి వీధి, లాడ్జి, ఇమామ్ వీధులలో వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షబ్బీర్‌వలి, సల్మా, భారతి, షేక్షావలి, మణిగోపాల్‌రెడ్డి, రెడ్డయ్య, మోహన్ పవర్, బాబా షరీఫ్, బండల షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రరెడ్డి, రామచంద్రారెడ్డిలను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎంసుధీర్‌రెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని 15,16,17,18 వార్డులలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ ప్రచారం నిర్వహించి మాట్లాడారు. మండల పార్టీ ఇన్‌చార్జి ఎం. సురేంద్రనాథ్‌రెడ్డి, జేసీసీ కన్వీనర్ డి.సూర్యనారాయరెడ్డి, వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డిలు అంకాలమ్మగూడూరు, హిమకుంట్ల, అగ్రహారం, నిడివెల్ల, దుద్దేకుంటల గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి సోదరుడు రమాకాంత్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిశోర్‌రెడ్డి, బీఎస్ బ్రహ్మానందరెడ్డి, హైటెక్ రవి, హరినాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, అశోక్ రెడ్డి, ప్రహ్లాదారెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వేముల : వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డిలు పట్టభద్రులను అభ్యర్థించారు. గురువారం మండలంలోని మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లె, కె.కె.కొట్టాల గ్రామంలో వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథం, మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, శివశంకర్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, రాజారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. చెన్నూరు గ్రామంలోని బెస్త కాలనీ, బుడ్డాయపల్లె, అరుంధతినగర్, తూర్పు దళితవాడల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరాజు, ఎర్రసాని నిరంజన్ రెడ్డి, సత్యరాజు, చంద్రారెడ్డి, మహేష్‌రెడ్డి, పాలగిరి ఉమామహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

లింగాల : మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించి సామాజిక తనిఖీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో గ్రామ సభలు, ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలనపై చర్చలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి రికార్డులను సామాజిక తనిఖీ బృందం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, ఎస్ఆర్పీ సుబ్బయ్య, మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున, ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏపీఓ లావణ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు రూరల్ : గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా కన్వీనర్ కె.రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి ప్రవేశ పరీక్ష అనంతరం వెలువడిన ఆధారంగా రిజర్వేషన్ ప్రకారం సీట్ కేటాయించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మార్చి 5వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు చేసిన తరువాత ఏలాంటి మార్పు ఉండదని ఆయన తెలిపారు.